తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

జనంసాక్షి

www.janamsakshi.org

హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి
వికారాబాద్

శనివారం
7 నవంబర్ 2026

పేజీలు : 08

Follow :





ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ఇబ్రహీంపట్నంలో ప్రజా విచారణ

- రూ. 2.36 కోట్ల పనులపై సామాజిక తనిఖీ
- రికార్డులు ఇవ్వని పంచాయతీ రాజ్ శాఖపై ఆగ్రహం
- ఆ శాఖ తీరుపై ఉన్నతాధికారులకు నివేదిక
- అడిగిన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు, 125 రోజుల పని కల్పిస్తాం
- జిల్లా అడిషనల్ డీఆర్‌డీఓ ఎన్. సుభాషిణి

రంగారెడ్డి, నవంబర్ 6(జనంసాక్షి):
ఎట్టకేళ్లకు ఉపాధి హామీ సామాజిక తనిఖీ అయ్యింది అనిపించారు. ప్రజల ప్రజల భాగస్వామ్యం లేకుండానే అధికారుల సమక్షంలోనే మండల సభ నిర్వహించారు. సామాజిక తనిఖీ విభాగం అధికారులు చేసిన తనిఖీ రిపోర్టును చదివి వినిపించారు. అధికారులు ఆమోదముద్ర వేశారు. చివరికి ప్రజా సమస్యలు గాలికి వదిలేశారు. 2025 ఏప్రిల్ ఒకటి నుండి 2026 మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ విభాగం అధికారులు తనిఖీ చేశారు. గ్రామాల్లో రిపోర్టర్లు తయారు చేశారు. లోటుపాతులను రికార్డు చేశారు. ఆ రిపోర్టును ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన 18వ విడత సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్)లో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ప్రిసైడింగ్ అధికారిగా అడిషనల్ డీఆర్‌డీఓ ఎన్. సుభాషిణి హాజరై తనిఖీలను పర్యవేక్షించారు.

రూ. 2.36 కోట్ల ఉపాధి పనుల తనిఖీ.
ఉపాధి హామీ పథకం కింద మండలంలో మొత్తం 312 పనులకు గాను వేతనాల కింద రూ.2,07,34,066 పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇక సామగ్రి ఖర్చు (మెటీరియల్ కాస్ట్) కింద రూ. 29,20,221 చొప్పున మొత్తం రూ. 2,36,54,287 వెచ్చించినట్లు అధికారులు తెలిపారు. అలాగే అటవీ శాఖకు సంబంధించి 10 పనులకు గాను వేతనాల ఖర్చు రూ. 26,41,294, సామగ్రి ఖర్చు రూ. 3,64,704 చొప్పున మొత్తం రూ. 30,05,998 పనులపై ఆడిట్ నిర్వహించారు.

ఇంజనీరింగ్ విభాగంపై అసంతృప్తి..
పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మొత్తం 43 పనులకు గాను కేవలం 9 పనులకు మాత్రమే రికార్డులు సమర్పించడంతో పూర్తిస్థాయిలో తనిఖీ సాధ్యపడలేదనీ సామాజిక తనిఖీ విభాగం అధికారులు రిపోర్ట్ చేశారు. రికార్డులు అందించని పంచాయతీరాజ్ శాఖ అధికారులపై ఆగ్రో వ్యక్తం చేశారు. ఆ శాఖ మొదటి నుంచి నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని మండిపడ్డారు. చేసిన పనులకు రికార్డులు అప్పజెప్పడానికి ఇబ్బందులు ఏముంటాయని ప్రశ్నించారు. ఆ శాఖ నిర్లక్ష్య వైఖరిపై ఆ విభాగానికి చెందిన అధికారులపై ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పిస్తున్నట్లు అడిషనల్ డీఆర్‌డీఓ సుభాషిని తెలిపారు.

90 శాతం బతికిన మొక్కలు..
ఉపాధి హామీ కింద చేపట్టిన నీటి నిల్వ పనులు భూగర్భ జలాలు పెరగడానికి ఎంతో దోహదపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. వనమహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల్లో 90 శాతం మొక్కలు బతికి ఉన్నాయని తెలిపారు. అయితే రైతులకు పంపిణీ చేసిన అవెన్యూ, ఫార్మ్ ప్లాంటేషన్ మొక్కల సర్వైవల్ శాతం చాలా తక్కువగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అడిగిన వెంటనే జాబ్ కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. రోజువారీ వేతనం రూ. 308 చెప్పు నా అందజేస్తున్నామన్నారు. ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గి వ్యవసాయ సాగు విస్తీర్ణం తగ్గిన నేపథ్యంలో ఉపాధి హామీ పనులు ఎంతో ఊరటనిస్తాయన్నారు. పని కోరిన ప్రతి ఒక్కరికీ తక్షణమే జాబ్ కార్డులు జారీ చేసి 125 రోజుల పని కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతి కూలీకి రోజుకు రూ. 308 వేతనం చెల్లిస్తున్నట్లు చెప్పారు. విధుల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో ఏపీడీ శేషు కుమార్, ఎంపీడీవో ప్రమీల నాయక్, అంబుడ్స్‌పర్సన్ సునీత, ఏవీవో సురేష్ కుమార్, జెక్యూసీ సునీత, ఎస్ఆర్‌పీ అశోక్, ఏపీవో బి. తిరుపతాచారి, ఈసీ రవికుమార్, ఎంపీవో ఇంచార్జ్ ఎం. వెంకట్ రెడ్డిలతో పాటు సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎల్‌బీ నగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్

43 ద్విచక్ర వాహనాలు గుర్తింపు

- 24 బీర్ బాటిళ్లు, 54 మద్యం క్వార్టర్ బాటిళ్లు
- స్వాధీనం - ముగ్గురు అనుమానితుల గుర్తింపు



హయత్ నగర్, నవంబర్ 6 (జనం సాక్షి) : మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఏకలవ్య నగర్, నాంచారమ్మ బస్తీలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎల్‌బీ నగర్ జోన్ డీసీపీ, ఎల్‌బీ నగర్ డివిజన్ ఏసీపీ పర్యవేక్షణలో ఈ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మొత్తం 212 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. వీరిలో ఇద్దరు డీసీపీలు, ఒక అదనపు డీసీపీ, ఇద్దరు ఏసీపీలు, 10 మంది ఇన్‌స్పెక్టర్లు, 18 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లు, 38 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, 23 మంది మహిళా పోలీసు సిబ్బంది, 116 మంది ఏఆర్ సిబ్బంది ఉన్నారు.
తనిఖీల్లో సరైన పత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలను గుర్తించారు. అలాగే 24 బీర్ బాటిళ్లు, 54 ఆఫీసర్స్ ఛాయిస్ మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పాపిలాన్ పరికరం ద్వారా 105 మందిని ధృవీకరించారు. ఒక రౌడీషీటర్‌తో సహా ముగ్గురు అనుమానితులను గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేందుకు పోలీసులు చర్యలు ప్రారంభించారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు ఎల్‌బీ నగర్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బి. వెంకటేశం తెలిపారు.

ఉప్పల్ అభివృద్ధికి రూ.7 కోట్ల నిధులు

- మూడు డివిజన్లలో 15 పనులకు ప్రభుత్వ మంజూరు
- రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం
- మందుముల పరమేశ్వర్‌రెడ్డి కృషితో నిధుల విడుదల
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ

ఉప్పల్, నవంబర్ 6 (జనం సాక్షి): ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరో విడత నిధులు మంజూరయ్యాయి. ఉప్పల్ సర్కిల్--9 పరిధిలోని రామంతాపూర్, చిల్కానగర్, ఉప్పల్ డివిజన్లలో 15 అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం సుమారు రూ.7 కోట్ల నిధులు కేటాయించింది. నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి కృషితో నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ శ్రేణులు పేర్కొన్నాయి.ఉప్పల్ డివిజన్‌లో శ్రీశ్రీనగర్ ప్రధాన రహదారిపై రూ.37 లక్షలతో సెంట్రల్ మీడియన్, పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, పునర్నిర్మాణానికి నిధులు కేటాయించారు. అలాగే గాంధీనగర్‌లో యువజన సంఘం భవన అభివృద్ధికి రూ.10.30 లక్షలు, ముదిరాజ్ సంఘం కమ్యూనిటీ హాల్‌లో సదుపాయాల కల్పనకు రూ.26 లక్షలు, పాత మున్సిపల్ కార్యాలయ భవనానికి రూ.45 లక్షలు, సీనియర్ సిటిజన్స్ భవన విస్తరణకు రూ.17 లక్షలు మంజూరయ్యాయి.



చిల్కానగర్ డివిజన్‌లో ఆనంద్‌నగర్ కాలనీలో రోడ్ల నిర్మాణానికి రూ.70 లక్షలు, లక్ష్మీనారాయణ కాలనీలో దెబ్బతిన్న రోడ్ల పునర్నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారు. రామంతాపూర్ గాంధీనగర్‌లో రూ.65 లక్షలతో కమ్యూనిటీ హాల్, శాంతినగర్‌లో రూ.1.98 లక్షలతో బాక్స్ డ్రెయిన్ నిర్మించనున్నారు. కాలనీల్లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారులు, డ్రైనేజీ, ప్రజా భవనాల సమస్యలకు ఈ పనులతో పరిష్కారం లభించనుంది. మంజూరైన నిధులతో పనులను త్వరగా ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడి

అరెస్ట్, రూ.3 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



హయత్ నగర్, నవంబర్ 5 (జనం సాక్షి) : మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస ఇళ్ల దొంగతనాలకు పాల్పడుతున్న యర్రంశెట్టి చరణ్ విష్ణేష్ అలియాస్ చరణ్ (25) అనే నిందితుడిని వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేశారు.వనస్థలిపురం విజయపురి కాలనీ ఫేజ్-1లో అక్టోబర్ 17 నుంచి 22 మధ్య జరిగిన ఇంటి దొంగతనం కేసు దర్యాప్తులో నిందితుడి వివరాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడు రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనంపై కాలనీల్లో తిరుగుతూ తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించేవాడు. చిన్న ఇనుప రాడ్‌తో ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాల్లోని బంగారు, వెండి ఆభరణాలు, నగదును దొంగిలించేవాడు.
దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు తన వద్దే ఉంచుకుని, డబ్బును విలాసవంతమైన జీవనశైలికి ఖర్చు చేసేవాడు.2026 నవంబర్ 5న సాయంత్రం 4 గంటలకు ఎన్జీఓ కాలనీలోని ఓ నగల దుకాణం సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని 11 గ్రాముల బంగారు ఉంగరం,15 గ్రాముల రెండు జతల బంగారు చెవిపోగులు, మత్తెలు,వన్‌ప్లస్ సెల్‌ఫోన్ వీటి మొత్తం విలువ రూ.3,00,000/-. నిందితుడి పైన కీసర పోలీస్ స్టేషన్ 3, సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ 1, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ 3మొత్తం 7 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, ఎల్‌బీనగర్ జోన్ డీసీపీ బి. అనురాధ, ఐపీఎస్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ జరిగింది. వనస్థలిపురం డివిజన్ ఏసీపీ టి. కరుణాకర్ రావు, ఎస్‌హెచ్‌ఓ ఎస్. రవిబాబు, డీఐ బి. రాజేష్, డీఎస్ఐ వి. రవి, ఎస్ఐలు, వనస్థలిపురం క్రైమ్ టీమ్ సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు.

బాల్‌రాజ్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన శ్రీశైల్ రెడ్డి



తాండూరు నవంబర్ 6(జనంసాక్షి) తాండూర్ మండలం చెనగేష్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బాల్‌రాజ్ గౌడ్ మాతృమూర్తి అకాల మరణం చెందడంతో, తాండూరు నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాతృమూర్తి మృతికి సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ పరామర్శ కార్యక్రమంలో రాజు పటేల్ తో పాటు చెనగేష్‌పూర్ బీఆర్ఎస్ నాయకులు ప్రశాంత్ గౌడ్, శాంతయ్య, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చోరవతో ఎస్సీ హాస్టల్ విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం



తాండూరు నవంబర్ 6(జనంసాక్షి)ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చోరవతో ఎస్సీ హాస్టల్ విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం అయింది. తాండూరు నియోజకవర్గంలో ని బషీరాబాద్ మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధుల ద్వారా హాస్టల్‌లో నూతన బోర్‌వెల్ డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు.ఎమ్మెల్యే తాగునీటి సమస్యను గుర్తించి తక్షణమే స్పందించి బోర్‌వెల్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు త్రాగు నీటి సమస్య పరిష్కారం అవ్వడంతో విద్యార్థులు, హాస్టల్ సిబ్బంది ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు..అనంతరం హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం పరంగా అందిస్తున్న వసతులు, భోజనం మరియు వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

రోడ్లు బాగు చేయండి సార్లూ

ఓగులాపూర్ గేట్ వద్ద విద్యార్థుల గంటపాటు ధర్నా



కోట్ పల్లి, నవంబర్ 6 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లా బంటారం , కోట్‌పల్లి మండలాల్లో రహదారులు గుంతలమయంగా మారి, కల్వర్టులు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వివిధ గ్రామాల విద్యార్థులు శుక్రవారం ఓగులాపూర్ గేట్ వద్ద తాండూర్--సంగారెడ్డి రహదారిపై గంటపాటు ధర్నా నిర్వహించారు ప్రభుత్వం స్పందించకపోతే అసెంబ్లీ ముట్టడి చేపడతామని విద్యార్థ లు, ప్రయాణికులు హెచ్చరించారు.

ఇంట్లో ఒక వ్యక్తి మృతి



కో ట్ పల్లి నవంబర్ 6 (జనంసాక్షి): మండల కేంద్రంలోని రాంపూర్ గ్రామానికి చెందిన జంగిలి బాబు (50) మృతి చెందినట్లు ఎస్ఐ మీనాక్షి తెలిపారు. గత కొంతకాలంగా రాంపూర్ లో ఒంటరిగా ఉంటున్నాడు తన భార్య వెంకటమ్మ కొడుకులు మనోజ్ ప్రశాంత్ ముగ్గురు హైదరాబాద్ లో ఉంటున్నారు. గురువారం నాడు చిరంజీవి అనే వ్యక్తి మృతుడు ఇంటి దగ్గరికి నీళ్లు పట్టుకోవడానికి వెళ్లగా ఇంటి నుండి దుర్వాసన రావడంతో ఈ విషయం మృతుడు భార్య వెంకటమ్మకు ఫోన్ చేసి తెలుపగా ఆమె వెంటనే తన కొడుకులతో పాటు రాంపూర్ కు వచ్చి చూడగా తన భర్త చనిపోయి ఉన్నాడు. దాంతో ఆమె నా భర్త తాగుడు అలవాటు ఉండటం వలన చనిపోయాడని అట్టి విషయంలో ఎవరిపైన అనుమానం లేదని ఫిర్యాదు చేయడం జరిగింది. దానిపై కేసు నమోదు చేసి విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు.

2028 ఎన్నికల్లో బీసీల రాజకీయ సునామీ సృష్టిస్తాం

జాజుల శ్రీనివాస్ గౌడ్

బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఈడిగ శ్రీనివాస్



ముషీరాబాద్, నవంబర్ 06 (జనం సాక్షి):వచ్చే ఎన్నికల్లో బీసీలకు రాజకీయ అధికారం దక్కేలా ఓటు యుద్ధానికి సిద్ధం కావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. 2028 ఎన్నికల్లో బీసీలు రాజకీయ సునామీ సృష్టించి పాలకులుగా ఎదుగుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యాం కుర్మా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు అసెంబ్లీ, పార్లమెంటులో తగిన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం లేదని విమర్శించారు. బీసీలకు అన్యాయం చేస్తున్న రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ బీసీలలో రాజకీయ చైతన్యం రోజురోజుకూ పెరుగుతోందని, బీసీ కులగణన కోసం దేశవ్యాప్త ఉద్యమం చేపట్టాలని అన్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ బీసీలు రాజకీయాల్లో యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలని, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఐక్యంగా పోరాడాలని సూచించారు. అనంతరం బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా పనిచేస్తున్న రంగారెడ్డి జిల్లా తాండూరుకు చెందిన ఈడిగ శ్రీనివాస్ గౌడ్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసి బీసీల రాజకీయ అధికార సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నాయకులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, యువజన నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.


హకీంపేటలో మెగా రైతు మేళాకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి

- **సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో అధికారులు సమన్వయంతో పని చేయాలి**
- **వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**
- **పటిష్ట బందోబస్తు: ఇంటెలిజెన్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎస్పీ స్నేహ మెహ్రా**



బొంరాస్ పేట, దుద్యాల, నవంబర్ 6 (జనం సాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు రోజుల పర్యటన నేపథ్యంలోఅన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఇంటెలిజెన్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,ఎస్పీ స్నేహ మెహరాల తో కలిసి (ఎ ఎస్ ఎల్)అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ సమావేశం హకీంపేట్ నందు నిర్వహించారు.శుక్రవారం హకీంపేట్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో హె లిప్యాడ్ ను పరిశీలించారు.భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ,వైద్య సేవలు,విద్యుత్ సరఫరా తదితర అంశాలపై ఇంటెలిజెన్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,ఎస్పీతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఇంటెలిజెన్స్ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అగ్నిమాపక వాహనాన్ని అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా తగిన ప్రదేశంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారులపై ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వైద్య సిబ్బందిని, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని, అంబులెన్స్‌లలో అత్యవసర వైద్య పరికరాలు, ఎమర్జెన్సీ కిట్ సిద్ధంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రిలో ఎమర్జెన్సీ విభాగం వద్ద వైద్యులను అందుబాటులో ఉంచాలని తెలిపారు.విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు చేపట్టడంతో పాటు అత్యవసర పరిస్థితుల కోసం జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు.ఆహార భద్రత అధికారులు ఆహార పదార్థాలను తనిఖీ చేసి, నాణ్యతపై నిర్ధారణ చేసిన తర్వాతే సంబంధిత వ్యక్తులకు ఆహారాన్ని అందించాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఆర్‌అండ్‌బీ అధికారులు భారీ కేడింగ్స్, వైద్య ఆరోగ్య శాఖ అంబులెన్స్‌లను అవసరమైన వైద్య సిబ్బందితో సిద్ధంగా ఉంచాలని తెలిపారు.విద్యుత్ శాఖ, ఆహార భద్రత శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, పర్యటన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా జరిగేలా భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ,వైద్య సేవలు,విద్యుత్ సరఫరా వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా,డిఎస్పీ శ్రీనివాస్, పోలీస్ శాఖకు సంబంధించిన సిఐలు,ఎస్ఐలు , ఆర్ అండ్ బి,సంబంధిత శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బార్వాద్‌లో కాంగ్రెస్‌కు చెందిన ఉపసర్పంచ్ శివకుమార్ బీఆర్ఎస్‌లో చేరిక



కోట్‌పల్లి నవంబర్ 06 (జనంసాక్షి):కోట్‌పల్లి మండలం బార్వాద్ గ్రామంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన బార్వాద్ గ్రామ ఉపసర్పంచ్ శివకుమార్‌తో పాటు పలువురు యువ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ఉపసర్పంచ్ శివకుమార్‌తో పాటు యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పరమేష్, జి. మహేష్, టీ. మహేష్, పి. ఆంజనేయులు, బి. రాకేష్, శ్రీశైలం, శ్రీనివాస్, మోహన్, శ్రీకాంత్ తదితరులు బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా డాక్టర్ మెతుకు ఆనంద్ మాట్లాడుతూ.... కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందడం లేదని భావించి పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. సాధారణంగా అధికారంలో ఉన్న పార్టీలోకి ఇతర పార్టీల నాయకులు చేరుతారని, అయితే తెలంగాణలో ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకానికి ఈ చేరికలు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. కేసీఆర్‌ను కోల్పోయామని పలువురు మహిళలు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు, కన్నీళ్లే మిగులుతున్నాయని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ ఏదీ.. చిన్నారులకు భద్రత ఏదీ

- 2023లో శంకుస్థాపన.. నిధులు మంజూరైనా మొదలుకాని పనులు
- ఐదు నెలలుగా టెండర్ల పేరుతో జాప్యం.. అధికారుల తీరుపై ఆగ్రహం



కీసర, నవంబర్ 06 (జనంసాక్షి)అంగన్వాడీ చిన్నారుల భద్రత అధికారులకు పట్టదా ? ప్రహరీ గోడ లేకుండా పాములు, పందుల మధ్య చిన్నారులు చదువుకోవాల్సిందేనా ? నిధులు మంజూరై, శంకుస్థాపన జరిగి మూడేళ్లు గడుస్తున్నా.. నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదు? అంటూ కీసర అంగన్వాడీ-3 కేంద్రం పరిస్థితిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ కేంద్రానికి ప్రహరీ లేకపోవడంతో చిన్నారుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పాములు, పందుల బెడదతో పాటు దోమల సమస్య కూడా వేధిస్తుండటంతో పిల్లలను కేంద్రానికి పంపాలంటేనే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం సామాజిక కార్యకర్త తుడుం శ్రీనివాస్ అంగన్వాడీ-3 కేంద్రాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రహరీ గోడ నిర్మాణానికి 2023లో శంకుస్థాపన చేయడంతో పాటు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందన్నారు. అయినప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియ పేరుతో ఐదు నెలలుగా జాప్యం చేయడం సమంజసం కాదన్నారు. ఖమ్మం ఘటన తర్వాతైనా అధికారులు అంగన్వాడీ కేంద్రాల భద్రతపై దృష్టి సారించారా? అని ప్రశ్నించారు. గత ఏడాది నుంచి పలుమార్లు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేయడంతో పాటు సంబంధిత అధికారులను కలిసి సమస్యను వివరించినా ఫలితం లేదన్నారు. ఈ సమస్యపై గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయంలోనూ వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి మెమో జారీ చేసి, సమస్యను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారని గుర్తుచేశారు. అయినా నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రహరీ గోడ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి, చిన్నారులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కీసర గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాగుల రమేష్ ముదిరాజ్, యువ నాయకులు సుమన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆశాల సహనానికి పరీక్ష.. సమ్మెకు సన్నద్ధం

రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలి

డిసెంబర్ 15 నుంచి నిరవధిక సమ్మె



మేడ్చల్-మల్కాజిగిరి, నవంబర్ 06 (జనంసాక్షి)ప్రజారోగ్య సేవల్లో కీలకంగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నా కనీస వేతనం, ఉద్యోగ భద్రత లేకుండానే విధులు నిర్వహించాల్సి వస్తోంది. పెరుగుతున్న పనిభారం.. చాలీచాలని పారితోషికాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆశాలు ఇక పోరుబాట పట్టేందుకు సిద్ధమయ్యారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించకుంటే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మె చేపడతామని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అనిత, రేవతి కళ్యాణి స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా కార్యకర్తలు గత 20 ఏళ్లుగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్య సేవలందించడంతో పాటు అంటువ్యాధుల నివారణలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలోనూ ప్రాణాలకు తెగించి సేవలందించిన తమకు నేటికీ నెలకు రూ.9,900 మాత్రమే పారితోషికం అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా పారితోషికం పెంచకపోవడమే కాకుండా పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.50 లక్షల బీమా, రూ.5 లక్షల రిటైర్మెంట్ ప్రయోజనం, పెన్షన్, సెలవులు, ప్రసూతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఏఎన్ఎం, జీఎన్ఎం శిక్షణ పొందిన ఆశాలకు పదోన్నతులు కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన సమ్మెలు, ఆందోళనల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో డిసెంబర్ 15 నుంచి జరిగే నిరవధిక సమ్మెను విజయవంతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే. ఉన్నికృష్ణ, యూనియన్ నాయకులు ప్రవీణ, వసంత, భాగ్యమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

హబ్సీగూడలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు హెల్ప్ డెస్క్

కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాటు



హబ్సీగూడ, నవంబర్ 6 (జనం సాక్షి): మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు హబ్సీగూడ డివిజన్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు.హబ్సీగూడ డివిజన్ రవీంద్రనగర్ కాలనీలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ ఎదురుగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఈ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హబ్సీగూడ కోఆర్డినేటర్ మహమ్మద్ తౌఫిక్ హాజరై గ్రాడ్యుయేట్లకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, ముఖ్యంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించిన పట్టభద్రులు ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా, నిర్దీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటు నమోదు ప్రక్రియపై సరైన అవగాహన లేని వారికి సహాయం అందించేందుకే ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు .అనంతరం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి సూచనల మేరకు హబ్సీగూడ డివిజన్‌లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రాడ్యుయేట్లందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తుల్లో అర్హులైన పట్టభద్రులకు కూడా ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని నాయకులు కోరారు. ఓటరు నమోదుకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి సహాయం పొందాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల బాబురావు, హబ్సీగూడ సీనియర్ నాయకులు గన్నారం విజయ్ కుమార్, మురళీకృష్ణ ముదిరాజ్, రాజు నాయక్, గుండు రాజన్న, గంగా యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసు నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల లక్ష్మీనారాయణ, సుమన్ నాయక్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టిల పేరుతో మోసం

కేసులో ప్రధాన నిందితుడి అరెస్ట్



శంకర్ పల్లి, నవంబర్ 6 (జనం సాక్షి)సుమారురూ.4 కోట్ల చిట్‌ఫండ్ మోసం కేసులో ప్రధాన నిందితుడు గుడిశెట్టి సుధాకర్ (50)ను శంకర్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.చిట్టీల పేరుతో అధిక వడ్డీ, లాభాలు ఇస్తామని నమ్మించి 48 మంది నుంచి రూ.3.62 కోట్లు వసూలు చేసి తిరిగి చెల్లించకుండా పరారైనట్లు నిందితుడిపై ఆరోపణలు ఉన్నాయి.నవంబర్ 5న అరెస్ట్.. 2021 నుంచి 2024 వరకు చిట్టీల పేరుతో బాధితుల నుంచి రూ.3,62,41,000/- వసూలు చేసినట్లు ఫిర్యాదులు అందడంతో సి.ఐ రుద్వీర్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. సి.ఐ మాట్లాడుతూ.. ఆకర్షణీయమైన వడ్డీ, అధిక లాభాల ఆశతో మోసపోవద్దని,సుదీర్ఘ పరిచయాలు ఉన్న వ్యక్తులైనా ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెట్టుబడులు పెట్టే ముందు పూర్తి వివరాలు పరిశీలించాలని కోరారు.

మాక్ పార్లమెంట్‌లో విద్యార్థుల ప్రతిభ



కోట్‌పల్లి, నవంబర్ 06 (జనంసాక్షి): కోట్‌పల్లి మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని ప్రతిభ చాటుకోవడం అభినందనీయమని మండల విద్యాధికారి చందర్‌ప్ప అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య విలువలు, పార్లమెంటరీ విధానాలపై అవగాహనతో పాటు వక్తృత్వ నైపుణ్యాలను పెంపొందిస్తాయని తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా ప్రోత్సాహం, సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, మోహన్, నర్సింహారెడ్డి, తిరుమలయ్య, మల్లేశం, యాదవరెడ్డి, శివప్రసాద్, అంజయ్య, ఫాతిమా బేగం, యాస్మిన్ బేగం, శ్యామయ్యలతో పాటు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

సైకిల్ టెక్స్ ప్రారంభోత్సవంలో పరిగి మున్సిపల్ కౌన్సిలర్లు



పూడూరు నవంబర్ 06 (జనంసాక్షి) పరిగి డివిజన్ పరిధిలోని యూత్ కాంగ్రెస్ కార్యకర్త ఇమ్రాన్ నూతనంగా ఏర్పాటు చేసిన సైకిల్ టెక్స్ షాప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయ్యూబ్ పరిగి మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ షాహేదా బేగం అక్బర్ హుస్సేన్ 17వ వార్డు కౌన్సిలర్ అఖిల శ్రీనివాస్ గుప్తా 8వ వార్డు కౌన్సిలర్ హబీబ్ ఉన్నీసా అయూబ్ 11వ వార్డు 2వ వార్డు కౌన్సిలర్ ఆరిఫ్ పటేల్ ఈ కార్యక్రమం లో అఫ్రోజ్ గఫ్ఫార్ పాల్గొని ఇమ్రాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు ఈ సందర్భంగా నూతనంగా ప్రారంభించిన వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఇమ్రాన్‌కు మంచి పేరు ప్రఖ్యాతులు రావాలని కౌన్సిలర్లు ఆకాంక్షించారు యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయడం అభినందనీయమని కొత్త వ్యాపారాల ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పట్టణ ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన తెలిపారు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ లింబాద్రి నియామకం



శామీర్ పేట, నవంబర్ 6(జనం సాక్షి) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ (ఐపీఈ) హైదరాబాద్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి అపారమైన విద్యా, పరిపాలన, సంస్థాగత నాయకత్వ అనుభవం ఉన్నవ్యక్తి అన్నారు. ఇంతకు ముందు ఆయన తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజిసి హెచ్ఈ) ఛైర్మన్, తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, ఉస్మానియా విశ్వ విద్యాలయంలోని పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్, హైదరాబాద్‌లోని డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ విద్యా సంస్థల ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ) వంటి పలు విశిష్ట పదవులను చేపట్టి నిర్వహించారు. వివిధ విద్యా, బోధనా సంస్థలతో తనకున్న అనుబంధంతో ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి ఉన్నత విద్య, ప్రజా పరిపాలనకు గణనీయమైన సేవలు అందించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కార కమిటీకి అంబుడ్స్‌పర్సన్‌గా పని చేస్తున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి విస్తృతమైన విద్యా అనుభవం, పరిపాలనా నైపుణ్యం, నాయకత్వం నుంచి సంస్థ విద్యా నైపుణ్యాన్ని, పరిశోధనా కార్యక్రమాలను, సంస్థాగత అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లడం వంటి విషయాలలో ప్రయోజనం పొందాలని ఐపిఈ ఆశిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా తుంకుంట ప్రధానోపాధ్యాయులు

వెంకట్ రెడ్డి పదవి విరమణ అభినందన సభ



శామీర్ పేట్, అక్టోబర్ 6(జనం సాక్షి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూముకుంట ప్రధానోపాధ్యాయులు చల్ల వెంకట్ రెడ్డి పదవీ విరమణ అభినందన సభ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా పాఠశాలకు వారు చేసిన సేవలను కొనియాడుతూ పాఠశాల ఉపా ధ్యాయులు,విద్యార్థి బృందం వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక మండల విద్యాధికారి కమలాకర్ ,జిల్లా ఆర్టిఏ మెంబర్ జైపాల్ రెడ్డి , టి ఎస్ జిహెచ్ఎం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు రామ్ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి సత్య ప్రసాద్ ,పాల్గొని వెంకట్ రెడ్డి సేవ లను కొనియాడుతూ సన్మానించారు. విద్యార్థులచే సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయులు తిరుమలేష్ , సత్తి రెడ్డి ,మంజుల , వనజ, నాగ శారద ,రజిని, వరలక్ష్మి ,శ్రీనివాస్ రెడ్డి ,మహేష్ , భాగ్యలక్ష్మి ,శ్రీదేవి, పద్మ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుకు 980 మంది దరఖాస్తులు



బొంరాస్ పేట, నవంబర్ 6 (జనం సాక్షి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటుకు ఇప్పటివరకు 980 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్ఐ శిరీష తెలిపారు.శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు రవి గౌడ్ ఆధ్వర్యంలో పలువురు పట్టభద్రులు ఓటు హక్కు నమోదు దరఖాస్తు ఫారాలను కార్యాలయంలో అందజేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు మహేందర్, టౌన్ ప్రెసిడెంట్ రాము గౌడ్, నర్సింలు తదితరులు ఉన్నారు.

మూడు డిజిటల్ మాడ్యూల్స్‌పై 350 మంది అధికారులకు శిక్షణ

ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగవంతమైన సేవలే లక్ష్యం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 06 (జనంసాక్షి)ప్రభుత్వ పాలనలో డిజిటల్ విధానాలను మరింత విస్తృతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈ-హెచ్ఆర్ఎంఎస్ , ఈ-శాంక్షన్స్, వామిస్ డిజిటల్ మాడ్యూల్స్‌పై శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమీకృత కలెక్టరేట్ (ఐడీఓసీ)లో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఖజానా అధికారి (డీటీఓ) వెంకటేశ్వర్లు కార్యక్రమాన్ని ప్రారంభించి, వివిధ శాఖల అధికారులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్లకు (డీడీఓలు) శిక్షణ అందించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 350 మంది అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాలు, ఆర్థిక శాఖ ఈ నెల 2న జారీ చేసిన సర్యులర్ మెమో ప్రకారం రాష్ట్రస్థాయిలో కార్యదర్శులు, శాఖాధిపతులకు ఇప్పటికే శిక్షణ పూర్తయింది. ఇందులో భాగంగా జిల్లాస్థాయి అధికారులకు క్యాస్కేడింగ్ విధానంలో శిక్షణ ఇచ్చారు. ఈ-హెచ్ఆర్ఎంఎస్ ద్వారా ఉద్యోగుల నియామకం నుంచి పదవీ విరమణ వరకు సర్వీసుకు సంబంధించిన నియామకాలు, పదోన్నతులు, సెలవులు, బదిలీల ప్రక్రియను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ఈ-శాంక్షన్స్ ద్వారా ప్రభుత్వ వ్యయాలకు సంబంధించిన నిధుల మంజూరు, బిల్లుల ప్రక్రియ డిజిటల్ విధానంలో చేపడతారు. వామిస్ ద్వారా ప్రభుత్వ అభివృద్ధి పనుల అంచనాలు, సాంకేతిక అనుమతులు, ఒప్పందాలు, పనుల పురోగతి, పూర్తిస్థాయి వివరాలను ఆన్‌లైన్‌లో పర్యవేక్షిస్తారు.ఈ మూడు మాడ్యూల్స్ అమలుతో ఫైళ్ల జాప్యానికి అడ్డుకట్ట పడటంతో పాటు ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పెరుగుతుందని డీటీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉద్యోగులకు, ప్రజలకు సేవలు వేగంగా అందించేందుకు డిజిటల్ విధానాలు దోహదపడతాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ విధానాలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పీఏఓ శర్మ, ఏటీఓ హైదర్ అలీ, ఎస్టీఓలు సాయికృష్ణ, అలివేలుమంగ, వినాయకరావు, జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది, వివిధ సబ్ ట్రెజరీ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రులైన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు చేసుకోండి

న్యాయవాది పట్లోళ్ల అమరేందర్ రెడ్డి



మోమిన్ పేట, నవంబర్, 06, (జనం సాక్షి) హైదరాబాద్, రంగారెడ్డి మహబూబ్ నగర్ పట్టభద్రులైన,ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రముఖ న్యాయవాది పట్లోళ్ల అమరేందర్ రెడ్డి శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిశారు, పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులందరూ నిరుద్యోగులు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే వరకు తమ నమోదు ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు.28 సెప్టెంబర్ 2026నాడు పట్టభద్రుల నియోజకవర్గ నోటిఫికేషన్ వచ్చిందని, అందులో భాగంగా అన్ని మండల రెవెన్యూ కార్యాలయ వద్ద ప్రచురించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి పట్టభద్రుడు 31 జనవరి 2023 నాటికి పట్టభద్రుడై ఉంటే ఓటరుగా నమోదు చేసుకోవాలని చెప్పారు. అందుకు సంబంధించిన ఫారం 18 ద్వారా వ్యక్తి వివరాలు భర్తీ చేసి ఇవ్వాలని, డిగ్రీ సర్టిఫికెట్ పై గెజిటెడ్ సంతకం పెట్టి తమ సమీపంలోని తహశీల్దార్ కార్యాలయం లోదాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల నోటిఫికేషన్ గెలువడే లోపు కార్యాలయంలో ఫారం అందజేయాలని అన్నారు.ఓటర్ గా నమోదు చేసుకునేందుకు ఫారం 18 తహశీల్దార్ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని, ఎలాంటి సందేహాలు ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను సంప్రదిం చాలని అన్నారు. గతంలో ఓటరుగా ఉన్న గ్రాడ్యుయేట్స్ కూడా ఇప్పుడు తప్పక ఓటర్ గా నమోదు చేసుకోవాలని, పాత ఓటర్ జాబితాలో పేరు ఉన్న దానిని పరిగణలోకి తీసుకోవడం జరగదని చెప్పారు.కాబట్టి తప్పక మళ్లీ ఓటర్ గా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఓటర్ గా నమోదు చేసుకునేందుకు ఫారం 18 కు ఆధార్, ఓటర్ ఐడి కార్డు,డిగ్రీ సర్టిఫికెట్ గెజిటెట్ సంతకంతో ఉండాలని తెలియజేశారు.ఒక వేళ కొందరు డిప్లమా చేస్తే డిగ్రీకి సమానంగా ఉండే ఈక్వాలిటీ సర్టిఫికెట్ వారి వారి యూనివర్సిటీ నుంచి పొంది, వాటిని ఫారం 18కు అటాచ్ చేసి ఇవ్వాలన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరు గా నమోదు చేసుకోవాలని పట్లోళ్ల అమరేందర్ రెడ్డి కోరారు.

ధరల పెరుగుదల, రైతులు--కార్మికుల సమస్యలపై పోరాటం



- **ఈ నెల 10న 'చలో కలెక్టరేట్' ధర్నాను జయప్రదం చేయండి**
- **ప్రజలు, రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలి**
- **సీపీఐ నాయకులు నిమ్మల నరసింహులు పిలుపు**

జవహర్ నగర్: నవంబర్ 6: (జనంసాక్షి)నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టడంతో పాటు రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న 'చలో కలెక్టరేట్' ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు, రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, రైతులకు జరుగుతున్న అన్యాయాలను నిలిపివేసి వారికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులకు జరుగుతున్న నష్టాలను అరికట్టి వారి హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ ప్రజలపై అదనపు ఆర్థిక భారం మోపడం సరికాదని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ ఆందోళనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఏఐటీయూసీ నాయకులు, మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, పి. కిరణ్ కుమార్, ఆదర్శనగర్ శాఖ కార్యదర్శి డి. నాగేష్, గిరిప్రసాద్ నగర్ శాఖ సహాయ కార్యదర్శి కె. కురుమయ్య, సిహెచ్. ఎల్లయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు కె. జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ,రేపు,ఎల్లుండి మూడు రోజులపాటు ముఖ్యమంత్రి కొడంగల్ పర్యటన

రూ.9,100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ,ప్రారంభోత్సవాలు

రైతు మేళా,ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం



బొంరాస్ పేట/దుద్యాల, నవంబర్ 6 (జనం సాక్షి): ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు.మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు రూ.9,100 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.ముఖ్యమంత్రి శనివారం మొదటిరోజు ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట చేరుకుంటారు. ఉదయం 11:10 గంటలకు హకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రదర్శన స్టాళ్లను సందర్శిస్తారు.మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. ఒంటి గంట నుంచి 2 గంటల వరకు పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు .మధ్యాహ్నం 3 గంటలకు హకీంపేట నుంచి రోడ్డు మార్గంలో కొడంగల్ నివాసానికి బయలుదేరుతారు.రాత్రి కొడంగల్‌లో బస చేస్తారు. ఆదివారం రెండవ రోజుఉదయం 9:15 గంటలకు కొడంగల్ నివాసం నుంచి బయలుదేరి హకీంపేట చేరుకుంటారు. 9:30 నుంచి 10:20 గంటల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. ఉదయం 10:20 గంటలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు.ఉదయం 10:30కు లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేయనున్నారు.ఉదయం 10:45 గంటలకు హకీంపేటలో రూ.4 కోట్లతో నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు.ఉదయం 11 గంటలకు రూ.2.35 కోట్లతో నిర్మించిన హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 11:30 గంటలకు బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను, 11:45 గంటలకు రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12:15 గంటలకు కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12:45 గంటలకు దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను, 1:15 గంటలకు రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1:40 గంటలకు కోస్గి మండలం నాచారం గ్రామంలో రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు--2కు శంకుస్థాపన చేస్తారు.ఈ రహదారిని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వద్ద జాతీయ రహదారి 167ఎన్ వరకు నిర్మించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2:45 గంటలకు దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 3:30 గంటలకు దౌల్తాబాద్‌లో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారు.అనంతరం కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.రూ.9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులుముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.వీటిలో కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు--2, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులు ఉన్నాయి.విద్యా రంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ఉన్నాయి.రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్ స్టాండ్లు, రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (చీఫాజ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు.తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు.హకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు.రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 భవనాల ప్రారంభంరూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 10 ప్రభుత్వ భవనాలను ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు.దుద్యాల సమీకృత మండల కార్యాలయ భవనం, కోస్గి సైన్స్ మ్యూజియం, హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు, హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీటిలో ఉన్నాయి.దుద్యాల, బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్లు, బొంరాస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొడంగల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం, దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. రైతులతో భారీ బహిరంగ సభ సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు బయలుదేరుతారు.రాత్రి 7 గంటల వరకు హకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభకు రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల నుంచి దాదాపు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆర్టీసీ డిపో గ్యాల్మీ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యుల సందడి

నూతన అధ్యక్షుడికి ఘన సన్మానం.. చిన్నారులను ఆశీర్వదించిన కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధులు



తాండూరు నవంబర్ 6(జనంసాక్షి)తాండూరు ఆర్టీసీ డిపోలో నిర్వహించిన గ్యాల్మీ కార్యక్రమంలో కంజర్ల విజయలక్ష్మి ఫౌండేషన్ సభ్యులు పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడిని ఫౌండేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు.ఆయన నాయకత్వంలో సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.అనంతరం యాలాల మండలం రాస్నం గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ రమేష్ కుమార్తె శుభకార్యమైన చారి ఫంక్షన్‌కు ఫౌండేషన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.రెండు కార్యక్రమాల్లోనూ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొని ఆత్మీయతను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ కోసం సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా, ప్రకాష్ గౌడ్,అప్రేష్ ముదిరాజ్,రమేష్, పాండు జైశ్రీరామ్ అశోక్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ కార్మికుల సేవలు మరువలేనివి



కంటోన్మెంట్ అక్టోబర్ 6. (జనం సాక్షి)దీపావళి పండుగ సందర్భంగా కంటోన్మెంట్ పారిశుద్ధ్య కార్మికులకు స్వీట్స్ పంపిణీ చేసిన బానుక నర్మద మల్లిఖార్జున్.పార్లమెంట్ సభ్యులు గౌరవ శ్రీ ఈటల రాజేందర్ గారి సూచన మేరకు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని 1వ వార్డు నుండి 8వ వార్డు వరకు పనిచేస్తున్న సుమారు (1000)పారిశుద్ధ్య కార్మికులందరికీ ఈరోజు స్వీట్ బాక్సులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా బానుక నర్మద మల్లిఖార్జున్ మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తూ, ఎండా వానలను సైతం లెక్కచేయకుండా తమ విధులను నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో విలువైనవని అన్నారు.దీపావళి పండుగ సంతోషాలను వారితో పంచుకోవాలనే సదుద్దేశంతో, ప్రతి ఒక్క కార్మికుడికి స్వీట్ బాక్స్ అందజేసారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి, వారి కుటుంబాల సంతోషానికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం 8 వార్డుల్లో బీజేపీ సినియర్ నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు..

చర్లపల్లిలో జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం

రూ.7 కోట్లతో క్రీడా, ఆరోగ్య సదుపాయాలు.. ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

స్థానిక యువతకు ఉపాధి కల్పనకు పరిశ్రమలు ప్రాధాన్యత ఇవ్వాలి



కాప్రా, నవంబర్ 6 (జనం సాక్షి) : చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో క్రీడా, ఆరోగ్య రంగాలకు ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. చర్లపల్లి నోటిఫైడ్ మున్సిపల్ ఇండస్ట్రియల్ ఏరియాస్ సర్వీస్ సొసైటీఆధ్వర్యంలో ఫేజ్-2లోని ప్రొఫెసర్ జయశంకర్ పబ్లిక్ పార్క్‌లో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆధునిక జిమ్, ఈఎస్ఐ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ గౌరవ అతిథిగా హాజరుకాగా, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఇంజనీరింగ్ వర్క్స్ రాము ఆధ్వర్యంలో పారిశ్రామికవేత్తల సహకారంతో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాక్స్ క్రికెట్, నెట్ క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులు, పికిల్‌బాల్ కోర్టు, ఆధునిక జిమ్, సమావేశ మందిరం తదితర సదుపాయాలు ఏర్పాటు చేశారు. పారిశ్రామిక ప్రాంతంలోని కార్మికులు, స్థానిక యువత ఆరోగ్య పరిరక్షణతో పాటు క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఈ కేంద్రం ఎంతగానో దోహదపడనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పరిశ్రమల స్థాపనతో పాటు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని, ఐటీతో పాటు ఎంఎస్ఎంఈ సహా అన్ని పారిశ్రామిక రంగాల్లో ఆధునిక సాంకేతికతను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.మల్కాజిగిరి పరిధిలో పెరుగుతున్న జనాభా, నగరీకరణకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు 24 రైల్వే బ్రిడ్జిలు మంజూరు చేసినట్లు కార్యక్రమంలో ప్రస్తావించారు. అలాగే డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ సదస్సు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించేందుకు జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. స్థానిక క్రీడాకారులు, యువత ఈ ఆధునిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శివశక్తి నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



కాప్రా, నవంబర్ 6 (జనం సాక్షి) : చర్లపల్లి డివిజన్ పరిధిలోని శివశక్తి నగర్‌లో రూ 20 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు గర్శీఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు యూజీడీ పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు కాలనీ వాసులు పరశురాములు -- అధ్యక్షులుశ్రీనివాస్ సత్తయ్య ప్రేమ్ నాయక్ కుమారయ్య మల్లేష్ ఆర్. రామ్ రెడ్డి శ్రీశైలం యాదగిరి ప్రవంతి పద్మ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలి

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



తాండూరు నవంబర్ 6(జనంసాక్షి)పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలనిఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.త్వరలో జరగనున్న ఉమ్మడి మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తాండూరు పట్టణంలోని తులసీ గార్డెన్స్ లో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సమావేశమైయ్యారుఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పరిధిలోని పట్టభద్రులకు ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలి.గ్రామాలు మరియు పట్టణాల్లో పట్టభద్రులను గుర్తించడం, ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలి.అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేయాలి.


జేబీఐటి కళాశాల విద్యార్థిని వైష్ణవి మృతిపై ప్రభుత్వం విచారణ జరపాలి

ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి అరుణ్ కుమార్



మొయినాబాద్,నవంబర్06,జనంసాక్షి:భారత విద్యార్థి ఫెడరేషన్ మొయినాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో జేబీఐటి కళాశాల వద్ద జేబీఐటి విద్యార్థి వైష్ణవి మృతి పై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బేగరీ అరుణ్ కుమార్, శ్రీనివాస్లు మాట్లాడుతూ.. కళాశాలలో ప్రొఫెసర్ ఉపేందర్ వేధింపుల వల్ల విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిందని దీనిపై ప్రభుత్వం పూర్తి విచారణ జరిపి అతనిపై చర్యలు తీసుకొని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. జేబీఐటి కళాశాలలో విద్యార్థులు ప్రొఫెసర్ల ద్వారా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దీనికి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జేబీఐటి కళాశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. కళాశాలలో వేధింపుల వల్ల గతంలో కూడా చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని అన్నారు జేబీఐటి కళాశాలలో విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందని ఎవరు కూడా ఆత్మహత్యకు పాల్పడవద్దని ఎస్ఎఫ్ఐ విద్యార్థులకు భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ ఉపాధ్యక్షుడు విష్ణు, చేవెళ్ల మండల కార్యదర్శి మాల చందు, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు, సాయి, కార్తీక్, కిరణ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యేతో బుయ్యని శ్రీనివాస్ రెడ్డి సౌజన్య భేటీ



తాండూరు నవంబర్ 6(జనంసాక్షి) బోధన్ శాసనసభ సభ్యుడు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డితో ఆర్బిఓఎల్ సీఈఓ కాంగ్రెస్ నాయ కులు బుయ్యని శ్రీనివా స్‌రెడ్డి మర్యాదపూర్వ కంగా భేటీ అయ్యా రు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.

మైనార్టీల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

హజ్‌హౌస్ పక్కన అసంపూర్తి భవన నిర్మాణానికి రూ.25 కోట్లు

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్ సిటీ, నవంబర్ 06 (జనం సాక్షి) : మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యా అభ్యున్నతితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అవసరమైన నిధులు కేటాయిస్తోందని వెల్లడిం చారు.మైనార్టీ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు మరిన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం ప్రజాభవన్‌లో మైనార్టీ సంక్షేమ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్‌తో కలిసి నిర్వహించిన ఈ సమావేశంలో విద్యాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, విద్యాసంస్థల నిర్మా ణాలు, స్టడీ సర్కిళ్ల ఏర్పాటు, ఓల్డ్ సిటీ అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. నాంపల్లిలోని హజ్‌హౌస్ పక్కన కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలి చిపోయిన బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ.25 కోట్లు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వివిధ రహదారుల విస్తరణ కోసం వినియోగించిన వక్ఫ్ భూములకు సంబంధించి జీహెచ్ఎంసీ నుంచి వక్ఫ్ బోర్డుకు రావాల్సిన నిధుల్లో ఈ మొత్తాన్ని భవన నిర్మాణానికి వినియోగించాలని సూచించా రు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ భవనంలో మైనార్టీ విద్యార్థుల కోసం స్టడీ సర్కిల్‌తో పాటు మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాల యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యా సంస్థల భవన నిర్మాణాలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో జాప్యం ఉండబోదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పాఠశాలలు, స్టడీ సర్కిళ్లు, ఇతర విద్యాసంస్థలకు అవసరమైన నిధులను సకాలం లో విడుదల చేయాలని అధికారులను ఆదేశిం చారు. మొఘ ల్‌పురా, బండ్లగూడ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన రెండు స్టడీ సర్కిళ్లకు సంబం ధించిన అడ్డంకులను తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచిం చారు. ఈ స్టడీ సర్కిళ్ల నిర్వహణకు అవసరమైన భవనాలను అందించేం దుకు అక్బరుద్దీన్ ఒవైసీ సంసిద్ధత వ్యక్తం చేయగా, సంబంధిత ప్రతిపాదనలను అధికారికంగా సమ ర్పించాలని కోరారు. మైనార్టీ విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని మరింత విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులు వెళ్లగలిగే దేశాల జాబితాలో ఈజిప్ట్, సౌదీ అరేబియాలను చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో షాదీ ముబారక్ పథకం, ఇస్లామిక్ కల్చరల్ సెంటర్‌కు ప్రత్యామ్నాయ స్థలం కేటాయింపు, రాజీవ్ యువ వికాసం పథకం కింద మైనార్టీల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల విడుదల తదితర అంశాలపై చర్చించారు. క్రైస్తవ మైనార్టీల సమస్యలను కూడా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటా మని హామీ ఇచ్చారు. సంక్షేమ పథకాల ప్రయో జనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడా లని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో శాసనసభలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ, మైనార్టీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, కార్యదర్శి బి. షఫీఉల్లా, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలు భారీగా తగ్గింపు

రూ.8,500 ఉన్న నెలవారీ పాస్ ధర రూ.4,000కు కుదింపు

నవంబర్ 8 నుంచి కొత్త ధరలు అమల్లోకి : మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్ సిటీ, నవంబర్ 06 (జనం సాక్షి) : రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను తెలంగాణ ప్రభుత్వం భారీగా తగ్గించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ప్రజలపై ప్రయాణ ఖర్చుల భారాన్ని తగ్గించి, ప్రజా రవాణా సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.275కు తగ్గించారు. ఇందులో మెట్రో ప్రయాణానికి రూ.200, ఆర్టీసీ ప్రయాణానికి రూ.75 కేటాయించారు. ఈ పాస్‌తో రోజుకు గరిష్టంగా నాలుగు సింగిల్ జర్నీలు చేసుకునే అవకాశం ఉంటుంది. అదేవిధంగా నెలవారీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరను రూ.8,500 నుంచి రూ.4,000కు తగ్గించారు. ఇందులో మెట్రో ప్రయాణానికి రూ.3,000, ఆర్టీసీ ప్రయాణానికి రూ.1,000 కేటాయించారు. ఈ పాస్ ద్వారా నెలకు గరిష్టంగా 50 రౌండ్ ట్రిప్పులు ప్రయాణించవచ్చని మంత్రి వివరించారు. ధరల తగ్గింపుతో నెలవారీ పాస్ వినియోగదారులకు రూ.4,500, రోజువారీ పాస్ వినియోగదారులకు రూ.125 వరకు ఆదా కానుంది. నవంబర్ 8 నుంచి అమల్లోకి ప్రభుత్వం ప్రకటించిన కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అమల్లోకి రానున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత సంస్థలను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. ప్రయాణికుల ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాన్య ప్రజలకు ఊరటనిస్తుందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

నార్సింగి సర్కిల్ పరిధిలో రూ.6.48 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం



శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, నవంబర్6(జనంసాక్షి) నార్సింగి సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రూ.6 కోట్ల 48 లక్షల 60 వేల విలువైన అభివృద్ధి పనులకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నార్సింగి, ఖానాపూర్, గండిపేట్, వట్టినాగులపల్లి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ పనులను చేపట్టారు.ఈ సందర్భంగా నార్సింగి వార్డు 124లోని వ్యవసాయ మార్కెట్ వద్ద రూ.28.50 లక్షలతో పశువుల షెడ్ నిర్మాణం, ఖానాపూర్, గండిపేట్ వార్డు 126లో రూ.20 లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నార్సింగి వార్డులోని పలు కాలనీల్లో రూ.1.58 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, నార్సింగి హైట్స్‌లో వాటర్ ట్యాంక్ పక్కన పార్కు, డాగ్ పార్కు కోసం రూ.83 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.అలాగే వైఎస్ఆర్ విగ్రహం నుంచి నిర్మల ఆసుపత్రి వరకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి 60 ఫీట్ రోడ్డు వరకు, ఏఆర్ఎం కాఫీ ప్లాజెస్ నుంచి వరలక్ష్మి టిఫిన్ సెంటర్ వరకు రూ.94 లక్షలతో ఆర్సీసీ సెంట్రల్ మీడియన్ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. గండిపేట్ వార్డు 125లో అల్లు సినిమా నుంచి బస్ స్టాప్ వరకు రూ.98 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, వట్టినాగులపల్లి గ్రామంలోని పలు ప్రాంతాల్లో రూ.1.66 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో నార్సింగ్ డివిజన్ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ కోట వేణు గౌడ్, గుడిమల్కాపూర్ ఏఎంసీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, పత్తి శ్రీకాంత్, నార్సింగి ఏఎంసీ డైరెక్టర్లు ఎర్వుల కుమార్, బాల్ రెడ్డి, శ్రీకాంత్, లక్ష్మి శ్రీ, మాజీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపిటిసి సాయిరాం ముదిరాజ్, నాయకులు కె. వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పాడి రంగాన్ని బలోపేతం చేయడమే హెరిటేజ్ లక్ష్యం





- హెరిటేజ్ డైరీ ఆధ్వర్యంలో చౌదర్ పల్లి గ్రామంలో స్టీల్ పాల క్యాన్ల పంపిణీ

తలకొండపల్లి నవంబర్ 06 (జనంసాక్షి): హెరిటేజ్ డైరీ ఆధ్వర్యంలో చౌదర్ పల్లి గ్రామంలో పాడి రైతులకు పశు పోషణ. యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా పాడి రైతులకు స్టీల్ పాల క్యాన్లు పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హెరిటేజ్ డైరీ హెడ్ ప్రొక్టర్మెంట్ రామ్మోహనరావు,హైదరాబాద్ రీజియన్ హెడ్ నర్సింగ్ రావు,ఏరియా మేనేజర్ భాష హాజరైనారు.తలకొండపల్లి సీసీ పరిధిలోని చౌదర్ పల్లి గ్రామంలో పాలు పోసే పాడి రైతులకు స్టీల్ పాల క్యాన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ..హెరిటేజ్ డైరీలో పాలు పోసే ప్రతి పాడి రైతుకు ఉచితంగా 2లక్షల ప్రమాద బీమా కల్పిస్తామన్నారు.అదేవిధంగా సబ్సిడీ ద్వారా దాణా,కాల్షియం, మినరల్ మిక్చర్స్,నట్టల మందులు పంపిణీ చేస్తున్నామన్నారు.పాడి రైతులకు లీటరుకు 50 పైసల చొప్పున బోనస్ అందిస్తున్నామన్నారు.పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటుగా డైరీ లోన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. హెరిటేజ్ డైరీలో పాలు పోసే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పాల నాణ్యత పెరిగితేనే రైతుకు లాభం వస్తుందని,స్టీల్ క్యాన్లు వాడటం ద్వారా పాలు శుభ్రంగా, స్వచ్ఛంగా ఉంటాయని తెలిపారు.పాడి రైతులు పాల ఉత్పత్తిని పెంచుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని పిలుపునిచ్చారు.గ్రామంలో పాడి రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు హెరిటేజ్ డైరీ ఎల్లప్పుడూ ముందుంటుందని హామీ ఇచ్చారు.రైతుల సంక్షేమమే హెరిటేజ్ డైరీ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తలకొండపల్లి సీసీ ప్లాంట్ మేనేజర్ స్వామి గౌడ్,సూపర్ వైజర్ శివ,డాక్టర్ ప్రభాకర్,స్థానిక సర్పంచ్ భారతమ్మ గోపాల్,పవన్,పాల సేకరణ ప్రతినిధి బండారు రవి,గ్రామ పెద్దలు,పాడి రైతులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం

- మేడిపల్లిలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య
- పెద్ద మంగళారంలోనూ మరో ఇంటి ప్రారంభం
- ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన కౌన్సిలర్, స్థానిక నాయకులు
- అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యం



మొయినాబాద్, నవంబర్ 6 (జనం సాక్షి):
పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. శుక్రవారం మొయినాబాద్ మండలం మేడిపల్లి గ్రామంతో పాటు మొయినాబాద్ మున్సిపాలిటీలో పర్యటించిన ఆయన పలు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.ముందుగా ఉదయం 9 గంటలకు మేడిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉదయం 9.30 గంటలకు మొయినాబాద్ మున్సిపాలిటీ 18వ వార్డు పరిధిలోని పెద్ద మంగళారంలో మరో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. 18వ వార్డు కౌన్సిలర్ చేగూరి అరుణ రామకృష్ణ గౌడ్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు కౌన్సిలర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు పాటి జగన్మోహన్‌రెడ్డి, పడమటి మమతారెడ్డి, గీతా వనజాక్షి, ప్రజాప్రతినిధి సురంగల్ చారి, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

- ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే అవకాశం
- ఫైర్ సర్వీస్‌తో పాటు పోలీస్ శాఖ అనుమతులు తప్పనిసరి
- నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు

జనం సాక్షి, అమీర్‌పేట/ సనత్ నగర్ :దీపావళి పండుగ వస్తోందంటే చాలు.. బాణసంచా దుకాణాల సందడి మొదలవుతుంది. అయితే ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ఈ వ్యాపారంలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలకు అగ్నిమాపక శాఖ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. బాణసంచా విక్రయించాలంటే తప్పనిసరిగా తాత్కాలిక ఫైర్ సర్వీస్ లైసెన్స్ పొందాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

దరఖాస్తు విధానం ఇలా..
అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి హోం పేజీలోని ‘అప్లై ఫర్ ఫైర్ సర్వీస్ లైసెన్స్ (ఫైర్ క్రాకర్స్)’ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అనంతరం లాగిన్ విండోలో ‘రిజిస్టర్’పై క్లిక్ చేసి పేరు, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, చిరునామా తదితర వివరాలను నమోదు చేయాలి. కొత్తగా రిజిస్టర్ చేసుకున్న ఐడీతో లాగిన్ అయి ఫైర్ లైసెన్స్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. అప్లికేషన్ పేజీలో ‘టెంపరరీ ఫైర్ క్రాకర్స్ షాప్’ను ఎంపిక చేసుకుని దుకాణం పేరు, చిరునామా, స్థలానికి సంబంధించిన వివరాలను నమోదు చేయాలి. అలాగే దుకాణం చుట్టుపక్కల 20 మీటర్ల పరిధిలో ఉన్న నిర్మాణాల వివరాలను కూడా పొందుపరచాలి.

భద్రతా నిబంధనలు పాటించాలి..
బాణసంచా దుకాణాలను అగ్నినిరోధక సామగ్రితో కూడిన పెద్దలోనే ఏర్పాటు చేయాలి. అత్యవసర సమయాల్లో మంటలను అదుపు చేసేందుకు ప్రతి దుకాణంలో ఇసుకతో నింపిన ఫైర్ బకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, హోస్ రీల్స్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచాలి. దుకాణ ప్రాంగణంలో లేదా పరిసరాల్లో భూగర్భ నీటి నిల్వ ట్యాంక్ లేదా ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా నీటి సౌకర్యం కల్పించాలి. దుకాణాలకు సమీపంలో ఉండే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు, విద్యుత్ కంట్రోల్ ప్యానళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. నాణ్యమైన వైరింగ్‌ను మాత్రమే వినియోగించాలి. లైసెన్స్ నిబంధనల ప్రకారం అనుమతించిన పరిమితికి మించి బాణసంచా నిల్వ చేయకూడదు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
బాణసంచా దుకాణాల నిర్వాహకులు తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ నిబంధనలను పాటించాలని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పూర్ణకుమార్ సూచించారు. అదేవిధంగా బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు చేపట్టే వ్యాపారులు అగ్నిమాపక శాఖ అనుమతులతో పాటు పోలీస్ శాఖ నుంచి కూడా తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్సార్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రమాదాల నివారణకు వ్యాపారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జనంసాక్షి కథనానికి స్పందన.. తీగజాతి మొక్కల తొలగింపు

కీసర, నవంబర్ 06 (జనంసాక్షి) : దమ్మాయిగూడా డివిజన్ పరిధి లోని సైలెంట్ అవెన్యూ కాలనీలో విద్యుత్తు స్తంభానికి తీగజాతి మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా మారిన విషయంపై జనంసాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ‘అల్లుకున్న నిర్లక్ష్యం.. ప్రమాదం పొంచి ఉంది’ శీర్షికన వచ్చిన కథనంపై విద్యుత్తు శాఖ ఏఈ రాజ్‌కుమార్ స్పందించారు. శుక్రవారం సిబ్బందితో స్తంభం చుట్టూ అల్లుకున్న తీగజాతి మొక్కలను తొలగించారు. సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



హైదరాబాద్ సిపి సజ్జనార్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

హైదరాబాద్, నవంబర్ 06 (జనంసాక్షి) : హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పోలీస్ బాస్ విసి సజ్జనార్ కు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దీపావళి మహా పర్వదినం ప్రత్యేక హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శుక్రవారం ఆమె సిపి సజ్జనార్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ నగరం పరిధిలో శాంతిభద్రతలు అదుపులో ఉండడం ఎంతో శుభసూచకమని, మంచి కార్యదక్షత కలిగిన వ్యక్తి పోలీస్ అధికారిగా బాధ్యతల్లో కొనసాగుతుండడం గొప్ప విషయం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు మంచి పరిపాలనను అందించాలంటే తన అనుగుణంగా మంచి అనుభవం కలిగిన, గురుతర బాధ్యత కలిగిన అధికారులు సైతం ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని, ఈ కోవకు చెందినవ్యక్తే విసి సజ్జనార్ అని చిగిరింత పారిజాతా నరసింహారెడ్డి తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పక్షపాతి అని, రాష్ట్ర ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ పార్టీ నిర్మాణం, రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం సాధించడమే తన ముందున్న లక్ష్యం అని పారిజాత నర్సింహారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

మియాపూర్ శ్రీ చైతన్య కళాశాలలో మెగా రక్తదాన శిబిరం: హాజరైన అరికపూడి

శేర్లింగంపల్లి, నవంబర్ 06 (జనంసాక్షి) : శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీ బాయి జన్మదినాన్ని పురస్కరించుకొని శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మరియు దుర్గ బాయ్ దేశ్ ముఖ్ మహిళాసభ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా నిర్వహించిన మెగా ఉచిత రక్తదానం శిబిరాన్ని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ ప్రారంభించారు. ఈ మేరకు మియాపూర్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ, జయరాం, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి, శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజిఎం రవి కుమార్ తో కలిసి శుక్రవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యాసంస్థల చైర్ పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదిన కేక్ కట్ చేసి ఆహుతులకు పంచడంతోపాటు ప్రత్యేక హార్దిక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శ్రీ చైతన్య కళాశాలలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా రక్తదానశిబిరం ను ప్రారంభించి, రక్తదానం శిబిరంలో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పిఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీ బాయి జన్మదినం సందర్భంగా శ్రీ చైతన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మరియు దుర్గాబాయ్ దేశ్ ముఖ్ మహిళాసభ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా నిర్వహించిన మెగా ఉచిత రక్తదానం శిబిరం ను ప్రారంభించుకోవడం చాల గొప్ప విషయం అని, ఇందులో భాగంగా విద్యాసంస్థల చైర్ పర్సన్ ఝాన్సీ లక్ష్మీ బాయి కి జన్మదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నానన్నారు. నేడు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలలో సైతం లక్షలాదిమంది విద్యార్థులను గొప్ప ప్రయోజకులుగా తీర్చిదిద్ది వారి జీవితాలలో వెలుగు నింపిన మహోన్నత వ్యక్తిగా అరికెపూడి అభివర్ణించారు. విద్యారంగంలో ఆమె సేవలు అమోఘమని, ఆమె



జన్మదినాన్ని పురస్కరించుకొని మెగా రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఎంతైనా అభినందనీయమన్నారు. రక్తదానం శిబిరంలో దాదాపుగా 300 మంది రక్తదానం చేయడం గొప్ప విషయమని, రక్తదానం లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియచేస్తున్నానని గాంధీ తెలియచేశారు. అన్ని దానాలకన్నా రక్తదానం చాలా గొప్పదని, రక్తదానం చేయండి ప్రాణ దాతలు కండి, రక్తదానం చేయడం ద్వారా మనం సాటి మనిషి ప్రాణాలు కాపాడిన వారమౌతామని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్తదానం చేయాలని కోరారు. ప్రతిరోజూ రక్తం అవసరం ఉండి ఎంతోమంది ఇబ్బందులకు గురౌతున్నారని, తలసేమియా, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారు రక్తం కోసం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కోవడం జరుగుతుందని, అలాంటి వారికి సకాలంలో రక్తాన్ని అందించడం ద్వారా వారికి జీవదానం చేసే గొప్ప అవకాశం లభిస్తుందన్నారు. ప్రతి రక్తపు బొట్టు విలువైనదని, ఏదైనా పునరుత్పత్తి చేసుకోవచ్చుగానీ రక్తాన్ని మాత్రం ఎవరో ఒకరు దానం చేయడంవల్లే పొందవచ్చన్నారు. రక్త దానంపై అపోహలు వీడాలని చైర్మన్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అక్తర్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కాంగ్రెస్ నేత శేరి సతీష్‌రెడ్డి సూటి ప్రశ్నలు
- పదేళ్ల పాలనలో హామీలు ఎందుకు అమలు చేయలేదు?
- స్టేడియం, పాఠశాల, పెట్రోల్ బంక్‌పై స్పష్టత ఇవ్వాలి
- రాజకీయ విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి



కూకట్‌పల్లి, నవంబర్ 6 (జనంసాక్షి): కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధిపై అబద్ధపు ఆరోపణలు చేయడం కాకుండా బహిరంగ చర్చకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి సవాల్ విసిరారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న సమయంలో పరిష్కరించని సమస్యలపై ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తడం ఏమిటని నిలదీశారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని సూచించారు. కూకట్‌పల్లి మెట్రో పార్కులో యువత కోసం స్టేడియం నిర్మిస్తామని గతంలో ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. కేపీహెచ్‌బీ–జేఎన్‌టీయూ రోడ్డులో పెట్రోల్ బంక్ ఏర్పాటుపై అప్పట్లో ఎందుకు నిర్ణయం తీసుకోలేదో వివరించాలని డిమాండ్ చేశారు. రమ్య గ్రౌండ్ సమీపంలో స్థానీయ ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మిస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదని, పాఠశాల పేరుతో నిధుల వసూళ్లు జరిగాయన్న ఆరోపణలపై వాస్తవాలను వెల్లడించాలని కోరారు. హైదరాబాద్‌లో అద్దె ఇళ్లలో నివసిస్తూ ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు తెలంగాణ హౌసింగ్ బోర్డు ద్వారా ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్ల నిర్మాణ ప్రతిపాదనను స్వాగతించాలని అన్నారు. సుమారు రూ.40 లక్షల విలువైన ఇంటిని రూ.6 లక్షలకే అందించే ప్రతిపాదన, లక్ష మంది గృహ అవసరాలను తీర్చాలనే లక్ష్యం అమలైతే పేదలకు ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. అయితే పథకం అమలు విధానం, అర్హతలు, నిధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సి ఉందన్నారు.

ప్రజల ఆశీర్వాదంతో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన మాధవరం కృష్ణారావు ఆ అవకాశాన్ని నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించాలని సతీష్‌రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని కోరారు. ప్రజలకు అవసరమైన రహదారులు, మౌలిక వసతులు, క్రీడా మైదానాలు, విద్యా సదుపాయాలు, గృహ నిర్మాణంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి అభివృద్ధి కోసం కలిసి పనిచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

జవహర్ నగర్‌లో బీజేపీకి భారీ బలం.. కాంగ్రెస్‌కు షాక్!

- అనుచరులతో కలిసి బీజేపీలో చేరిన కప్పల శ్రావణ్ కుమార్
- ఈటల రాజేందర్ సమక్షంలో పార్టీలో చేరికలు



జవహర్ నగర్: నవంబర్ 6 (జనంసాక్షి):
జవహర్ నగర్ 3వ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి కప్పల శ్రావణ్ కుమార్ తన అనుచరులతో కలిసి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ క్రియాశీలక నాయకులు బీజేపీలో చేరడం వల్ల జవహర్ నగర్‌లో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, ముఖ్యంగా జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గుర్తింపు, గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కలికోట కమలాకర్, జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, ఏనుగు సుదర్శన్ రెడ్డి, చంద్రారెడ్డి, గాలి సంపత్ యాదవ్, ముత్యం సుజాత, మహేందర్ యాదవ్, రామ్ నాయక్, రషీదా బేగం, పానుగంటి బాబు, అశోక్ గౌడ్, సంతోష్ గుప్తా, జోగారావు తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

- బొమ్మక్ కళ్యాణ్ కుమార్ హామీ
- దేవేందర్ నగర్ ముస్లిం శ్మశానవాటికలో వర్షపు నీటి నిల్వతో ఇబ్బందులు



బోడుప్పల్–జనంసాక్షి : దేవేందర్ నగర్ ముస్లిం శ్మశానవాటికలో నెలకొన్న వర్షపు నీటి నిల్వ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కళ్యాణ్ కుమార్ హామీ ఇచ్చారు. శ్మశానవాటికలో వర్షపు నీరు నిలిచిపోవడంతో అంత్యక్రియల నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని డివిజన్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అజ్హర్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శ్మశాన వాటికలో మొరం వేయించి, నీటి పారుదలకు తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వినతిపై స్పందించిన బొమ్మక్ కళ్యాణ్ కుమార్ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దనగళ్ల యాదగిరి, మేడ్చల్ జిల్లా మైనారిటీ విభాగం కార్యదర్శి ముస్తాక్, బి బ్లాక్ మైనారిటీ నాయకుడు అక్బర్, మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షులు అష్టల్, గులాం, యూత్ కాంగ్రెస్ నాయకుడు అరవింద్, బోడుప్పల్ మైనారిటీ విభాగం సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు విస్తృత ఏర్పాట్లపై

డాక్టర్ నర్ల సురేష్‌ను అభినందించిన ఎమ్మెల్యే మర్రి



అల్వాల్, నవంబరు 6 (జనంసాక్షి): మచ్చబొల్లారం డివిజన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి, అధిక సంఖ్యలో అర్హులను ఓటర్లుగా నమోదు చేయించేందుకు కృషి చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ నర్ల సురేష్‌ను ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అభినందించి సత్కరించారు. ఎమ్మెల్యే ఆదేశాలు, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జి నందికంటి శ్రీధర్ సూచనల మేరకు ఉచిత ఓటరు నమోదు సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ సురేష్ తెలిపారు. ఉద్యోగరీత్యా సమయం కేటాయించలేని వారు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అవగాహన లేనివారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బషీరుద్దీన్, సత్తన్న, వంశీతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి.. తల్లికి తీవ్ర గాయాలు

ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా సర్కిల్ వద్ద ప్రమాదం

కీసర, నవంబర్ 06 (జనంసాక్షి): లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. ద్విచక్రవాహనంపై తల్లితో కలిసి వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తల్లి తీవ్రంగా గాయపడింది. కీసర పోలీసుల వివరాల ప్రకారం.. చీకటిమామిడి గ్రామానికి చెందిన సూర్యప్రకాష్ (18) తన తల్లి సక్కుబాయితో కలిసి యాక్టివాపై ఈసీఐఎల్ నుంచి కీసర వైపు వెళ్తున్నాడు. ఓఆర్ఆర్ టోల్‌ప్లాజా సర్కిల్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తల్లీకొడుకులు రోడ్డుపై పడిపోయారు. ఈ క్రమంలో లారీ చక్రం సూర్యప్రకాష్ తలపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సక్కుబాయికి తలతో పాటు నడుము, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రులకు తరలించారు. సూర్యప్రకాష్ మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి, సక్కుబాయిని ఈసీఐఎల్‌లోని ఆక్సీకేర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు

బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కొండని లక్ష్మణ్



మహేశ్వరం,నవంబర్ 6(జనంసాక్షి):మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి బీఆర్ఎస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండని లక్ష్మణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.కల్వకోల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేసిన కొండని లక్ష్మణ్ వర్గీయులను, కొండని లక్ష్మణ్ మద్దతుతో గెలిచిన వార్డు సభ్యులకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే కల్వకోల్ గ్రామంలో పర్యటించారన్నారు.కల్వకోల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి బక్కని లక్ష్మమ్మ ఎన్నికలలో గెలిచారు.గెలిచిన బక్కని లక్ష్మమ్మ ఇంటికి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి వెళ్లి బక్కని లక్ష్మమ్మను అభినందించారన్నారు.కల్వకోల్ గ్రామంలో కొండని లక్ష్మణ్ వర్గం తీవ్ర అసంతృప్తితో ఉందన్నారు. తన భవిష్యత్ రాజకీయ కార్యాచరణ పై త్వరలోనే వెల్లడిస్తామన్నారు కొండని లక్ష్మణ్ తెలిపారు.

మానవత్వంతో పేద కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ సంపత్ కుమార్



పెద్దేముల్ నవంబర్ 6(జనంసాక్షి) తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండల్ తింసన్ పల్లి గ్రామానికి చెందిన బండమీది హనుమయ్య అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న తాండూరు బాలాజీ నర్సింగ్ హోమ్ అధినేత, బీవీజీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ సంపత్ కుమార్ మానవతా దృక్పథంతో స్పందించారు. హనుమయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతేకాకుండా వారి అంత్యక్రియల కోసం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా నిలవడం మనందరి బాధ్యత. కష్టకాలంలో ఆదుకోవడమే నిజమైన మానవత్వమని అన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- టీయూడబ్ల్యూజే తాండూరు డివిజన్ సమావేశంలో పిలుపు.
- జిల్లా అధ్యక్షుడిగా వేణుగోపాల్ రెడ్డి పోటీ



తాండూరు నవంబర్ 6(జనంసాక్షి) : టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తాండూరు డివిజన్ జర్నలిస్టుల సమావేశం తాండూరులో ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఈ నెల 10వ తేదీన వికారాబాద్ లో జరగనున్న టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రభ సీనియర్ రిపోర్టర్, సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ, టీయూడబ్ల్యూజే ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా పోటీకి సిద్ధమయ్యానని ప్రకటించారు. ఆయన ప్రకటనకు తాండూరు డివిజన్ విలేకరులందరూ మద్దతు పలికారు. అనంతరం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పర్కింగ్ జర్నలిస్టులందరికీ మున్నెగూడలో ప్రత్యేకంగా జర్నలిస్టుల నివాస టవర్స్ ఏర్పాటుకు, తాండూరులో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు కృషి చేస్తాను. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకే నా ప్రాధాన్యత" అని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో తాండూరు డివిజన్ జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక

- **బీసీ యువతను ఏకం చేసి హక్కులు, సంక్షేమం, రాజ్యాధికారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తా.**
- **ఈడిగ శ్రీనివాస్ గౌడ్**



తాండూరు నవంబర్ 6(జనంసాక్షి)బీసీ యువతను ఏకం చేసి హక్కులు, సంక్షేమం, రాజ్యాధికారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తా నని ఈడిగ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బీసీ యువజన సంఘం విస్తృతస్థాయి సమావేశంలో ఈడిగ శ్రీనివాస్ గౌడ్‌ను బీసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సలహాదారులు వి.హెచ్. హనుమంతరావు, టీఆర్ఎస్ పార్టీ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి తదితర ప్రముఖులు హాజరయ్యారు. బీసీ యువజన సంఘం జాతీయ, రాష్ట్ర నాయకులు, కార్యవర్గ సభ్యులు పాల్గొని నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఎన్నికను ఏకగ్రీవంగా ఆమోదించారు.

15 ఏళ్ల ఉద్యమ ప్రస్థానానికి దక్కిన గుర్తింపు.

తాండూరు నియోజకవర్గం, బషీరాబాద్ మండలం, రెడ్డిఘనాపూర్ గ్రామానికి చెందిన ఈడిగ శ్రీనివాస్ గౌడ్ గత 15 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమం, బీసీ ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ విద్యార్థి సంఘం నాయకుడిగా, యువ జన సంఘం నాయకుడిగా వివిధ హోదాల్లో సేవలందించారు. బీసీ హక్కుల సాధన, సామాజిక న్యాయం, యువత సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తూ వచ్చిన ఆయనకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు దక్కడం పట్ల బీసీ యువజన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేస్తాం.

ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షులు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ (శీనన్న), బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ, బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్, రాష్ట్ర అధ్యక్షులు మహేష్ యాదవ్, నరేష్, మల్లికార్జున్, విజయ్, చందు, భాస్కర్‌తో పాటు సంఘంలోని పెద్దలందరికీ, బీసీ సంక్షేమ, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల కార్యవర్గాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా బీసీ యువత ను ఐక్యం చేసి బీసీల హక్కులు, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాధికారం సాధన కోసం మరింత బలంగా ఉద్యమిస్తామని తెలిపారు. బీసీ యువత రాజకీయాల్లోకి పెద్ద ఎత్తున రావాలని, ఎమ్మెల్యేలు, ఎంపీలుగా పోటీ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లోకి రావాలనుకునే బీసీ యువతకు బీసీ యువజన సంఘం అండగా నిలుస్తుందని, బీజేపీకి ఆర్ఎస్ఎస్ ఎలాగో, బీసీ అభ్యర్థులకు బీసీ యువజన సంఘం అలా బలమైన అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

బీసీ కులగణన జరిగే వరకు పోరాటం.

రాష్ట్రవ్యాప్తంగా బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, హక్కులు, రాజకీయ అవకాశాలు కల్పించే దిశగా నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. బీసీ కులగణన పూర్తిస్థాయి లో జరిగి, బీసీలకు న్యాయం జరిగేంత వరకు తమ పోరాటం ఆగదని ఈడిగ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.బీసీ యువత ఐక్యతే బీసీల బలమని, యువతలో రాజకీయ చైతన్యం తీసుకొచ్చి సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనకు బీసీ యువజన సంఘాన్ని రాష్ట్రవ్యాప్తంగా మరింత బలోపేతం చేస్తామని ఆయన వెల్లడించారు.

బాలరాజ్ అరెస్టును తీవ్రంగా ఖండించిన ఉయ్యాల ప్రశాంత్ గౌడ్



హయత్ నగర్, నవంబర్ 6 జనం సాక్షి గొర్రెలు మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ దుదిమెట్ల బాలరాజ్ యాదవ్ అరెస్టును బీఆర్ఎస్ యువజన నాయకుడు ఉయ్యాల ప్రశాంత్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ పెద్దలు చేస్తున్న నిరాధార రాజకీయ ఆరోపణలను ప్రశ్నించినందుకే బాలరాజ్‌ను అరెస్ట్ చేయడం అన్యాయమని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఎలాంటి ఆధారాలు లేకుండా వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని, బల్మూరి వెంకట్ చేసిన వ్యాఖ్యలకు రాజకీయంగా సమాధానం ఇచ్చిన బాలరాజ్‌పై చర్యలు తీసుకోవడం సరికాదని ప్రశాంత్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును కాలరాయడం తగదని, రాజకీయ విమర్శలకు అరెస్టులు సమాధానం కాకూడదని ఆయన అన్నారు. బాలరాజ్‌పై అక్రమ కేసులు నమోదు చేయకుండా, ఆయనను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆగ్రోఫారెస్ట్రీ వ్యవసాయ పంటల సాగుతో రైతులకు అదనపు రాబడి

యాచారం, నవంబర్ 6(జనం సాక్షి) : మండలంలోని రైతు వేదికలో శుక్రవారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు 'అటవీ–వ్యవసాయ (ఆగ్రోఫారెస్ట్రీ) పంటల సాగు – ప్రాముఖ్యత మరియు ప్రయోజనాలు' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉద్యానవన అధికారి సురేష్ మాట్లాడుతూ... రైతులు సంప్రదాయ వ్యవసాయంతో పాటు అటవీ–వ్యవసాయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. భూముల స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా వేప, చింత, ఇప్ప, కుంకుడు మరియు మునగ వంటి చెట్లను పెంపొందించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. ఈ చెట్ల ద్వారా లభించే కాయలు, విత్తనాలు, ఆకులకు సంతలో (విపణిలో) మంచి ఆదరణ ఉందన్నారు. ముఖ్యంగా కుంకుడు, వేప, చింత ఉత్పత్తులను వివిధ కర్మాగారాల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారని తెలిపారు. మునగ సాగు ద్వారా ఆకులు, కాయల రూపంలో తక్కువ కాలంలోనే స్థిరమైన రాబడి వస్తుందని పేర్కొన్నారు. ఈ సాగు పద్ధతి వల్ల నేల కోత నివారణ, భూసార పెంపు, జీవవైవిధ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. కావున రైతులు తమ పొలాల గట్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో బహుళ ప్రయోజనాలనిచ్చే చెట్లను పెంచాలని కోరారు.



అనంతరం సహాయ ఉద్యాన సంచాలకులు శ్రీమతి అరుణ గారు మాట్లాడుతూ... రైతులు అటవీ–వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా వ్యవసాయంతో పాటు దీర్ఘకాలిక ఆదాయ వనరులను సమకూర్చుకోవచ్చని తెలిపారు. నిలకడైన వ్యవసాయ కేంద్ర సభ్యులు రాంబాబు పాల్గొని రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి సురేష్, సహాయ ఉద్యాన సంచాలకులు అరుణ, నిలకడైన వ్యవసాయ కేంద్ర సభ్యులు రాంబాబు, ఉద్యాన శాఖ అధికారిణి నవీన, వ్యవసాయ అధికారి రవినాథ్, ఉద్యాన విస్తరణాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు మరియు స్థానిక రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హిమాలయ శిఖరంపై రామంతపూర్ వాసి జయసింహగౌడ్ జెండా!

- **23 వేల అడుగుల ఎత్తైన పర్వతాన్ని అధిరోహించి అరుదైన ఘనత**
- **జయసింహగౌడ్‌ను అభినందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**
- **ఎవరెస్ట్ అధిరోహణకు సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ**



ఉప్పల్, నవంబర్ 6 (జనం సాక్షి): పర్వతారోహణలో రామంతపూర్‌కు చెందిన మారథాన్ రన్నర్, పర్వతారోహకుడు కలాలి జయసింహగౌడ్ మరో అరుదైన ఘనత సాధించారు. నేపాల్‌లో సుమారు 23 వేల అడుగుల ఎత్తైన హిమాలయ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి తన సాహసాన్ని చాటుకున్నారు. గతంలో ఆఫ్రికాలోని కిలిమంజారోతో పాటు అర్జెంటీనా, నేపాల్, లడఖ్ ప్రాంతాల్లోని పర్వత శిఖరాలను అధిరోహించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. తన విజయాల వివరాలను గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసింహగౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. యువతకు ఆయన విజయాలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనే జయసింహగౌడ్ లక్ష్యానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఎవరెస్ట్‌ను అధిరోహించి తెలంగాణకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, క్రాంతి, ప్రశాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చీలాపూర్‌లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు..

- **పట్టించుకోని అధికారులు!**
- **ఇళ్లపైనుంచి వేలాడుతున్న విద్యుత్ తీగలు**
- **రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు**
- **విద్యార్థులు, గ్రామస్థులకు పొంచి ఉన్న ప్రమాదం**
- **తక్షణమే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్థుల విజ్ఞప్తి**





పూడూరు, నవంబర్ 6 (జనం సాక్షి): పూడూరు మండలం చీలాపూర్ గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతుండటంతో గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు వెళ్తుండగా, గ్రామ మహిళా సంఘ భవనం సమీపంలోని రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. నిత్యం ప్రజల రాకపోకలు సాగించే ప్రాంతంలోనే ఇవి ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు నిత్యం ప్రయాణిస్తుంటారని, విద్యుత్ తీగలు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నామని తెలిపారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయడంతో పాటు ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను సురక్షితంగా సరిచేయాలని చీలాపూర్ గ్రామస్థులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ల విభజనపై హర్షం

తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన సక్రు నాయక్

హయత్ నగర్, నవంబర్ 6 (జనం సాక్షి) :



తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల తెలంగాణ గిరిజన సమాఖ్య హర్షం వ్యక్తం చేసింది. ఈ నిర్ణయంపై సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమావత్ సక్రు నాయక్ సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు ఉమ్మడిగా ఉన్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ కారణంగా గిరిజనుల సమస్యల పరిష్కారంలో పలు సాంకేతిక, పరిపాలనాపరమైన జాప్యాలు చోటుచేసుకునేవని పేర్కొన్నారు. తాజాగా ఎస్టీల కోసం ప్రత్యేక స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయం గిరిజనుల హక్కుల పరిరక్షణకు మరింత బలాన్ని చేకూరుస్తుందని అన్నారు. గిరిజనుల సంక్షేమం, విద్య, ఉద్యోగ అవకాశాలు, సామాజిక న్యాయం, హక్కుల పరిరక్షణ దిశగా ఈ నిర్ణయం ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా గిరిజన సంఘాలు చేస్తున్న డిమాండ్‌ను గుర్తించి, వారి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. నూతనంగా ఏర్పాటుకానున్న ఎస్టీ కమిషన్ ద్వారా గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం కలుగుతుందని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు మరింత సమర్థవంతంగా చేరుతాయని తెలిపారు. గిరిజనుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చే దిశగా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ గిరిజన సమాఖ్య తరపున మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు రమావత్ సక్రు నాయక్ పేర్కొన్నారు.